పెద్దకథ

# అనితరసాధ్యుడు

రంగనాయకమ్మ

**బుచ్చిబాబు ఇంటికి రాగానే నిర్మల ప్రేమగాథంతా విమల బుచ్చిబాబుకి వర్ణించి చెప్పేసింది.**

బుచ్చిబాబు సరిగ్గా వినకుండానే "ఏడీ ఆ కుర్రాడు వొచ్చాడా? పాపం ఇద్దరికీ పెళ్ళి చేసేద్దాం" అన్నాడు కాఫీ తాగుతూ.

"ఊఁ తర్వాత?"

"పాపం వాళ్ళబతుకు వాళ్ళే బతుకుతారు."



"ఎలా బతుకుతారు?"

"పాపం మెలాగో బతుకుతారు."

"నిర్మలకి నేను బోధించిందంతా కుప్ప చేసావుగావున్ను. దానికి మెనారిటీకూడా తీరలేదు. నువ్వు పెళ్ళి స్తానంటే వాళ్ళిద్దరూ ఇప్పుడు నీ వెంట పడతారు. నిర్మల్ని పిల్చి కేకలేసావని నీకు చెపుతోంటే చెప్పేది బుర్రకెక్కించుకోవేం?"

"పాపం ఎందుకు విమలా వాళ్ళని కేకలెయ్యడం? చక్కగా పెళ్ళిచేసేస్తే వాళ్ళే చదువుకుంటారు. ప్రేమించడం తప్పా చెప్పు?"

"ప్రేమించడం తప్పో, ఒప్పో నీ దగ్గిర నేను నేర్చుకోనక్కర్లేదు లే. ప్రేమించగానే పెళ్ళికి ఎగబడాలా? కొన్నాళ్ళు ఆలశ్యమైతే ఎదటివాళ్ళు మారిపోతారేమోనని భయం వుంటేనే తొందరగా పెళ్ళిలో ఇరికించెయ్యాలని చూస్తారు. లేకపోతే అంత తొందరెందుకు? ఇంతకీ నువ్వు నిర్మల్ని పిల్చి కేకలేస్తావా లేదా చెప్పు.'

"నీ కేకలెయ్యడం అయిందా?"

"సగమే అయింది."

"సరే. పిలువు. నేనూ కొంచెం కేకలేస్తాలే"

"నిర్మలా! బుచ్చిబాబు పిలుస్తున్నాడే" అని విమల వంటింట్లోకి ఒక కేక పెట్టింది.

నిర్మల సిగ్గుపడుతూ వొచ్చింది — "ఏంటి బావా? పిలిచావా?"

"వూరికేలే. ఏం చేస్తున్నావు? మళ్ళ వంట మొదలు పెట్టావా? ఏం కూరవండుతున్నావు?"

"కాకరకాయ వేపుడు." విమలే చెప్పింది."

"కాకరకాయల్లో కూడా చేదుచూడాలి. తెలుసా?"

"తెలుసు."

"అదే చెపుదామనీ ........ నీ ఫ్రెండ్

చాలా ముద్దుగా వున్నాడు నిర్మలా! పొద్దున్న వొచ్చిన కుర్రాడేగా? చాలా బాగున్నాడు. బుద్ధివంతుళ్ళాగున్నాడు.... మంచిపని చేశావు."

"ఏవిటి నువ్వు మాట్లాడేది?" అని విమల కళ్ళెర్రజేసింది.

"వొస్తున్నానా వరసగా? పాయింటు తర్వాత పాయింటు డెవలప్ చెయ్యాలి.... నిర్మలా! నువ్వింకా చిన్న పిల్లవే కదమ్మా!.... ఇంకో ఆర్నెల్లు ఆగు."

"ఆర్నెల్లా? ఆరేళ్ళా? సరిగ్గా చెప్పు" అని విమల మళ్ళీ కోపంగా చూసింది.

"చూడు బావా! ముందు పదేళ్ళంది. తర్వాత యెనిమిదేళ్ళంది. ఇప్పుడు ఆరేళ్ళంటోంది-ఆరేళ్ళాగాలా బావా?"

"ఆలశ్యమైతే అతనిలో యేమన్నా మార్పొస్తుందని భయమా నీకు?"

"ఛీ! ఛీ! అలాంటిభయం లేదు నాకు. వసంత్ అనితరసాధ్యుడు."

"ఏడిశావ్‌లే. మూడునెల్ల ప్రేమకే అనితరసాధ్యుడయ్యాడు!" అని తిట్టింది విమల.

"విమల మాటలకేంగానీ....నిర్మలా! ఇలా చూడు ఆరేళ్ళెందుగ్గానీ .... రెండేళ్ళాగు ఏం? అప్పటికి నీకు మైనారిటీ కూడా తీరుతుంది."

"బుచ్చిబాబు మాటలకేంగానీ .... ఒసే నిర్మలా! ఇలా చూడు! అతని మాటలు వింటే సర్వనాశనమైపోతావు. నీ కింకా కొన్నిపాఠాలు చెప్పాలి రాసుకో-కాయితం తెచ్చుకో."

బుచ్చిబాబు వెటకారంగా నవ్వాడు- "నీ పాఠాలు వింటే యిక చెల్లెలు బాగుపడ్డట్టే."

"బుచ్చిబాబు మొహం చూస్తావేమే! కాయితం తెచ్చుకో."

నిర్మల ఏడుపు మొహంతో కాయితం, పెన్నూ తెచ్చుకుంది- "ఊఁ చెప్పు...."

"వాడికి.... అంటే, నీ చిన్నబావయికి తలకాయ వుందా, లేదా? వుంటే దాన్ని వుపయోగిస్తాడా? లేదా? లేక, తాతగారి తలకాయమీద ఆధారపడతాడా?

"కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు. తండ్రిగారి, తాతగారి భావాలకు దాసులు" అనేపాట వాడికి కంఠతావొచ్చా? రాదా? రాకపోతే నేర్చుకుంటాడా, లేదా? నేర్చుకుంటే ఎప్పుడు నేర్చుకుంటాడు?

"వేయి పడగలు" చదివాడా, లేదా? చదివేప్పుడు దాన్ని విసిరికొట్టాడా? లేదా? విసిరికొడితే ఎన్నిసార్లు విసిరికొట్టాడు? ఏయే పేజీలు చదువుతూ విసిరికొట్టాడు? పుస్తకం మళ్ళీ పనికిరాకుండా విసిరికొట్టాడా, లేదా? విసిరికొట్టకపోతే ఎందుకు


## ఇంజనీరింగ్ డిప్లొమా హోల్డర్సుకు సదవకాశం

మీరు రెండు సంవత్సరాలలో గవర్నమెంటుచే B. E. డిగ్రీకు సమానముగా రికగ్నయిజ్ కాబడిన A. M. I. E. అర్హతను కరస్పాండెన్సు ద్వారా పొందుటకు రివైజుడ్ స్కీము ఏర్పడియున్నది. వివరములకు రూ. 5/- ఎం. ఒ. చేయండి.

ఎస్. టి. జ్ఞానప్రకాశం, M.E.,M.I.E. ప్రిన్సిపాల్

**సర్కారు ఇంజినీరింగు కాలేజి**

మచిలీపట్నం-521 001 (A. P.)

## నెలకు రు. 20/-లు సులభ వాయిదాపై



ప్రసిద్ధి చెందిన ఎకో-మల్టీ మిక్సర్-కమ్ గ్రైండరు రు. 480/- భారతీయ అవసరాలకోసం ప్రతి ఇంట్లో వంటగది కొరకు 2 సంవత్సరాలు గ్యారంటీ. ఎకో-బాబ్సన్ 2 బ్యాండ్ల ఎ.సి-కమ్-బ్యాటరీ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ కూడా లభించును. ధర రు. 280/- లైసెన్సు లేదు. మరియు ప్రఖ్యాతి చెందిన ఇండియన్ రిస్ట్‌వాచీ ధర రు. 260/-.

**ECHO RADIO & TRANSISTOR Co (AJ)**
**P. Box No. 9441, Delhi—51**

## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 806120

**SUPREME CORPORATION (BANKERS)**
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

## తెల్ల వెంట్రుకలుండవు

హెయిర్ డైకాదు. వెంటు చెర్చబడిన మా ఆయుర్వేద తలనూనె తెల్ల జుట్టును నిగనిగలాడే నల్ల జుట్టుగ చేస్తుంది. ఇది మెదడుకు, కళ్ళకు టానిక్కు. ఒకసారి వాడి చూడండి. మీరు పూర్తిగా సంతృప్తి పొందుతారు. వెల రు. 10/-పూర్తి కోర్సు రు. 26/- పోస్టేజి అదనం. ఇంగ్లీషులో వ్రాయండి

**SANJIWANI AUSHADHALAYA**
**P.o. Katri Sarai (Gaya)**

## సినీ పోటీ క్విజ్

తెలుగు సినీ పోటీ క్విజ్ నెం-1లో పాల్గొని 10,000/- నగదు బహుమతులు గెలవండి, మరియు (8) H. M. T రిస్ట్ వాచీలను పొందండి, వివరములకు 35 పై. పోస్టల్ కవరుపై మీ చిరునామా వ్రాసి మాకు పంపండి.

సూర్య ట్రేడర్,

356-గిరిపురం, తిరుపతి-517 507.

విసిరికొట్టలేదు ? ఏమిటి వాడి వుద్దేశం ?

పెళ్ళయిన పూటనించీ మంగళగౌరీ నోములు నోచమని కాల్చుకు తినకుండా వుంటాడా, వుండడా ? వుంటె ఎందుకు వుంటాడు ? వుండకపోతే...."

బుచ్చిబాబు నిర్మలకి పారిపొమ్మని సైగచేశాడు. ఆ సపోర్టుతో నిర్మల రాయడం మానేసి - "నేనింక రాయనే: ఈ ప్రశ్నలన్నీ పార్వతి దేవదాసు నడిగిందా? లైలామజ్నూనడిగిందా? రోమియో జూలియట్ నడిగిందా?" అని తీవ్రంగా ఎదురు తిరిగింది.

"రోమియో ఆడదికాదే, జూలియట్టే ఆడది. వాళ్ళంతా కాపరాలు చెయ్యదల్చుకున్నవాళ్ళు కారే పిచ్చిమొద్దూ! కలిసి కాపరం చెయ్యదల్చుకున్న వాళ్ళు ఈ ప్రశ్నలన్నీ అడుక్కోవాలి. వాడి భావాలు ఇదీ, దీని భావాలు వాడూ తెలుసుకోవాలి: లేకపోతే ఆ కాపరం ఏడిసినట్టు తయారవుతుంది. రెండు పెద్ద కీటకాలూ, కాసిన్ని పిల్ల కీటకాలూ బతికే మురిగ్గుంటలాతయారవుతుంది. తెలుసా ?"

ఏం చెప్పాలో నిర్మలకి తోచక

"నీ జవాబేమి" అన్నట్టు బుచ్చిబాబు కేసి చూసింది. బుచ్చిబాబుకూడా యేమీ తోచక గుటకలు మింగుతూ నించున్నాడు.

అంతలో దేవుళ్ళాగా చిన్నబ్బాయి వొచ్చాడు. కడిగిన ముత్యంలాగ అందరికీ ముద్దొచ్చే లాగ వున్నాడతను.

నిర్మల బైటికి పరిగెత్తి సిగ్గుతో మెలికలు తిరుగుతూవున్న అతన్ని చెయ్యిపట్టుకుని లోపలికి లాక్కొచ్చింది.

విమల వుపన్యసించే మూడ్‌లో వుండటంచేత — "ఇద్దరూ కూర్చోండి. క్లాసు తీసుకుంటాను" అంది.

బుచ్చిబాబు -"మనందరికీ నేను ఉప్మా చేస్తాలెండి. నాకు వుప్మా చెయ్యడం వొచ్చు" అని వంటింట్లోకి తప్పుకున్నాడు.

విమల పాఠం ప్రారంభించింది.

ప్రేమ ఎంత విలువైనది, దాన్ని ఎలా కాపాడుకోవాలి, మురుగునీటిలో మానవులు నశించిపోయేట్టు పాతమురుగు భావాలలో ప్రేమ ఎలా నశించిపోతుంది, అభ్యుదయ భావాలు లేకపోతే ప్రేమ ఎలా వెలవెల బోతుంది, ప్రేమలతకి ఆర్థిక స్వతంత్రత అనే నీరు ఎంత అవసరం, లేకపోతే అది ఎలా సర్వనాశనమై, ధ్వంసమై, ఇంకేదో ఐ.... ఎలా అయిపోతుందో వర్ణిస్తో వుండగా ఐదు నిమిషాల్లో నిర్మలా, చిన్నబ్బాయి ఆగలేక విమలముందు మోకరిల్లి-"వొప్పేసుకున్నాం. వొప్పేసుకున్నాం. పదేళ్ళదాకా పెళ్ళిమాటెత్తం. చదువులూ, వుద్యోగాలూ అయ్యేదాకా ఒకర్ని ఒకరం చూసుకోం, పలకరించుకోం. వొట్టు! వుపన్యాసం మానెయ్యి ! మానెయ్యి!" అని హాహాకారాలుచేశారు.

బుచ్చిబాబు పరిగెత్తుకొచ్చి అందరికీ తను చేసిన అల్పాహారం పెట్టి శాంతింపజేశాడు.

* * *

రెండ్రోజుల్లో వాళ్ళని రైలెక్కించి వొచ్చిన తర్వాత విమల నిరుత్సాహంగా కూర్చుని - "పెళ్ళికి ముందు కలిగే ప్రేమలో ఎంత మాధుర్యం వుందో! మనం పెళ్ళికి ముందు ప్రేమించుకోనే లేదు" అని విచారంలో మునిగిపోయింది.

"నేను మాత్రం నిన్ను ప్రేమించే పెళ్ళి చేసుకున్నాను" అన్నాడు బుచ్చిబాబు.

"అయితే మరి నాతో ఒక్కసారి కూడా ఎందుకు మాట్లాడలేదు ?"

"నువ్వెప్పుడన్నా మాట్లాడనిస్తేనా ?"

"మాట్లాడకుండా ప్రేమ ఏం ప్రేమ ? నువ్వు నన్ను ప్రేమించావని నమ్మకం ఏమిటి ?"

"ప్రేమించాను విమలా! నువ్వు పొడుగ్గా వుంటావుగా ? నువ్వు కాలేజీనించి వొస్తోంటేనే నాకు తెలిసిపోయేది."

"నువ్వు ప్రేమించింది నన్నో, మా అక్కనో ! అది నా కన్నా పొడుగు. నీకసలు కళ్ళు సరిగ్గా కనపడవు."

"కాదులే, నిన్నే. మీ అక్క నాతో మాట్లాడుతూనే వుండేది. నువ్వే మాటాడకుండా తిరిగేదానివి. నిన్నొకదాన్నే ప్రేమించాను. నేను అప్పుడూ ఇప్పుడూ కూడా ప్రేమించుకోలేదని బెంగ పడకు. నువ్వు కూడా నన్ను ప్రేమించావా?"

"ప్రేమించాను బుచ్చిబాబూ! కానీ, మాట్లాడాలని నాకు తోచలేదు. ఎవరూ చెప్పలేదు. ఎంత పిచ్చివాళ్ళమో కదూ?"

"పోనీలే,పోనీలే విమలా! మాట్లాడుకోపోయినా ప్రేమ పోలేదుగా- అప్పటికీ ఇప్పటికీ నేను నిన్నే ప్రేమిస్తున్నానుగా?"

"అవును నువ్వు అనితరసాధ్యుడివి."

"అదేదో తిట్టులా వుంది నాకు. నిర్మల చెప్పింటేనే దాని అర్థంగానీ, అట్లాంటి మాట లెందుకు చెప్పు ? నేను అనితరసాధ్యుణ్ణయితే నువ్వూ అనితరసాధ్యురాలివేగా?" అంటూ బుచ్చిబాబు విమల చేతిని ముద్దు పెట్టుకున్నాడు.

(అయిపోయింది)


బొల్లి, తెల్ల మచ్చలకు ఉత్తమ చికిత్స

ముఖముపై బొల్లి, తెల్లమచ్చలు వున్న యెడల పోస్టు ద్వారా (35 పై॥ కవరు పంపుతూ) గాని, పర్సనల్‌గా గాని సంప్రదించండి.

డా॥ నందిగం సాయిప్రసాదబాబు

పీపుల్స్ నర్సింగ్‌హోమ్,

హనుమాన్ జంక్షన్.

ఆదివారం : గురురెడ్డి రోడ్, కృష్ణలంక, విజయవాడ-520 013.

వార్తలకు, వ్యాఖ్యలకు "ఆంధ్ర జ్యోతి" దిన పత్రికనే చదవండి.

ఉచితము! ఉచితము!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రత్యేక మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,

వైద్యవిశారద, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రాఘాస్ క్లినిక్

బి. వి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA